**కథ**

# పెళ్ళిచూపులు

భోగి పండుగ ముందు రోజు రాత్రి!

హొయలొలికించే భంగిమల్లో కాళ్ల మువ్వల చిరుసవ్వడుల మధ్య రంగ వల్లులు వేస్తూ, గొబ్బెమ్మలు పెడ్తున్న కోనసీమ అందాల భామల మేని విరు పుల్ని మబ్బుల దుప్పటి తొలగిస్తూ కొంటె జాబిలి తొంగిచూస్తున్న వేళ...

ఊరి చివర రావి చెట్టు దగ్గరున్న పెద్ద గుండ్రాయి మీద కూర్చుని ఆలోచిస్తున్న రవితేజను ఆ ప్రక్కనే వున్న పదిహేనేళ్ళ శీను చూస్తూ-

"సాహసం చెయ్యరా డింభకా! మనస్సులోని కోరిక నెరవేరేను! కోరుకున్న దేవత ప్రత్యక్షమయ్యేను!" అన్నాడు నాల్గురోజుల క్రితం తమ ఊళ్లో వీరభద్ర టాకీసులో చూసిన పాతాళభైరవి సినిమాలోని నేపాళ మాంత్రికుని మాటల్ని అనుకరిస్తూ.

"తప్పదంటావా శీనూ?" అడిగాడు రవితేజ తన చేతిలోన్న ఫోటోని వందోసారి పరికించి చూస్తూ.

"అవసరం మనది! తప్పదు గురూగారూ!" అన్నాడు శ్రీను, రవితేజ ఇచ్చిన పదో చాక్లెట్ బార్‌ని పర పర నమిలేస్తూ

పెళ్ళంటూ చేస్కుంటే 'కోనసీమ సుందరి'నే పెళ్లాడాలనే తన చిరకాల వాంఛకనుగుణంగానే ఆ ఊళ్లో కాలెట్టిన రవితేజ స్వంత ఊరు-విజయవాడ!

ముంబయి షిప్‌యార్డులో ఇంజనీర్‌గా చేస్తున్న రవితేజ పాలకొల్లు పెద్దగోపురంలో జరిగిన తన క్లోజ్‌ఫ్రెండు పెళ్ళికి అనుకోకుండా ముంబయి నుండి నేరుగా పాలకొల్లు రావడం, అక్కడే జరిగిన మరోపెళ్ళిలో ఆ ఫోటోలోని సుందరాంగుల్ని చూసి మనస్సు పారేసుకోవడం చకచక జరిగిపోయాయి.

ఆ సుందరాంగులది కోనసీమలోని అమలాపురం దగ్గర అంబాజీపేట అని తెలుసుకోగలిగాడే గాని కనీసం వాళ్ల పేర్లు కూడా అతనికి తెలియదు. ఆ పెళ్లిలో వీడియోగ్రాఫర్ని కాకాపట్టి అతి కష్టం మీద ఆ సుందరీమణుల గ్రూపుఫోటో సంపాదించగలిగాడు.

నిజానికి అమలాపురంలో తనకు తెల్సున్న ఫ్రెండింట్లో వుండి ముందుకు ప్రొసీడవుదామనుకున్నాడు. తీరా ఆ ఫ్రెండు ట్రాన్స్‌ఫరై వేరే ఊరికి వెళ్లిపోవటంతో చేసేదిలేక అమలాపురంలోనే ఓ లాడ్జిలో బస చేయడం జరిగింది.

అంబాజీపేట వైపు మధ్యాహ్నం అన్యమనస్కంగా అద్దె టాక్సీలో వస్తున్న రవితేజను పనిమీద అమలాపురం వచ్చిన శీను లిఫ్టు అడగడం, దారిలో తనొచ్చిన విషయం దాపరికం లేకుండా శీనుకు చెప్పడం రవితేజకు లక్కీగా కలిసొచ్చింది.

తన పూర్తి సహకారం అందిస్తానని చేసిన శ్రీను ప్రామిస్‌కు అనుగుణంగానే రవితేజను ఇప్పుడక్కడ కల్సుకోవడం జరిగింది.

"ఫోటోలోని అమ్మాయిలంతా తెల్సన్నావుగా! ఇప్పుడు చెప్పు! ఎడమనుండి కుడిప్రక్కకు వాళ్ల పేర్లు" అడిగాడు ఆసక్తిగా రవితేజ.


"స్పందన, కవిత, సృజన, పల్లవి, సాహితి"

"అబ్బో..పేర్లు మాత్రం చక్కగా కుదిరాయి"

"ఫోటోలో వాళ్ల ఫిగర్లు కూడా అదిరాయి కదండి!"

"అందుకేగా ఇంతదూరం నేనొచ్చింది!"

"సాహితి, స్పందనలను మీరిక మర్చిపోవచ్చండి!" అంటూ ఉన్నట్టుండి ఆ చివర ఈ చివర వున్న వాళ్ళిద్దరి భాగాల్ని గ్రూప్ ఫోటో నుండి వేరుచేస్తున్నట్లుగా చింపేశాడు శీను.



ఆశ్చర్యంతోను, కోపంగాను చూస్తున్న రవితేజను చూస్తూ "వీరిద్దరూ ఫోటోలో వుండగా ఎవ్వరైనా చూస్తే డేంజరండి గురూగారూ!"

"ఎందుకని?"

"మా ఊరి మాజీ ప్రెసిడెంటుగారమ్మాయి-స్పందనకు ఆల్రెడీ మ్యారేజీ ఫిక్సయిపోయిందండి! పోతే సాహితికీ ఊళ్లోనే మేనరికం వుందండి.వాళ్ల బావో గ్యాంగ్‌లీడరు! ఇకపోతే మీరు సెలక్టు చేసుకోవల్సింది మిగిలిన ముగ్గుర్లో ఒకర్ని!"

"ఈ ముగ్గురూ ఏం చదువుకున్నారు?"

"ఒకమ్మాయి టెన్తండి! మరో అమ్మాయి ఇంటరండి!..ఇంకో అమ్మాయి డిగ్రీ చదివి ఉద్యోగం కూడా చేస్తోందండి!"

"ఎవరెవరు ఏమేమి చదివిందీ వివరాలు చెప్పవేంటి?"

"ముందు ముందు మీరే తెల్సుకుంటారుగా!"

"సర్లేగాని.. ఈ ముగ్గురిలో నీకే అమ్మాయి నచ్చింది!" అడిగాడు రవితేజ చింపగా మిగిలిన గ్రూఫ్ ఫోటోని శీనుకి చూపిస్తూ.

"ముగ్గురూ బాగా నచ్చారండి!"

"ఛత్! అదికాదు నేననేది! ఈ ఫోటో నీకిచ్చి సెలక్టు చేసుకోమంటే ఎవరికి ఫస్టు ప్రిఫరెన్సు ఇస్తావు?"

"కట్నం దండిగా తెచ్చుకునే అమ్మాయికండి!"

"ఎందుకని?" నవ్వుతూ అడిగాడు రవితేజ.

"పెళ్లాం ముందు తోకాడించే కుక్కలా పడుంటే చాలు..బయట తోకలేని కోతిలా లైఫ్‌ను హాయిగా ఎంజాయ్ చెయ్యెచ్చు కదండి!"

"సెకండు ప్రిఫరెన్సు ఎవరికిస్తావు?" నవ్వాపుకుంటూ అడిగాడు.

"చదువుకున్న అమ్మాయికండి! అసలే అత్తెసరు మార్కులగాడ్ని..ముందు ముందు నేనెందుకూ కొరగాకపోతే ఆ అమ్మాయి ఉద్యోగం చేస్తూ నన్ను పోషిస్తేనేగాని

నా ఆటలు సాగవుకదండి! అదిసరే గానండి..మీకే అమ్మాయి కావాలి?''

''అంటే?''

''కట్నంతో వచ్చే గొప్పింటి అందమైన అమ్మాయి కావాలా? చదువుకుని ఉద్యోగం చేస్తూ సంపాదిస్తున్న అందమైన అమ్మాయి కావాలా? పని పాటలు తెల్సిన అణకువైన అందమైన అమ్మాయి కావాలా?'' అడిగాడు శీను నవ్వుతూ.

సమాధానం చెప్పకుండా నవ్వేస్తూ ''మన ప్రస్తుత కర్తవ్యం?'' అడిగాడు రవితేజ.

''ఆపరేషన్ హెచ్.వి.పి! అంటే...హరిదాసు వేషంలో పెళ్లిచూపులండి!''

''వా..వ్వాట్?''

''అవునండి! హైటెక్ పద్ధతిలో వెరైటీ పెళ్లిచూపులండి! ఆల్రెడీ అమ్మాయిల్ని చూశానంటున్నారు. ఇప్పుడేమో వాళ్లను టెస్టు చేసి నచ్చినమ్మాయిని సెలక్టు చేసుకుంటారన్నమాట!''

రవితేజ ఇంకా తేరుకోకముందే శీను ''ముందుగా చెప్పి పెళ్లి చూపులకెళ్ళడం అవుటాఫ్ ఫేషనండి! అలా వెళ్తే అరంగుళం మందాన్ని పౌడరు రాసి మేకప్పులో అప్సరసగా కన్పించే అమ్మాయే ఆ తర్వాత 'అప్పలమ్మ'లా దర్శనమివ్వొచ్చుండి! అందుకని చెప్పాపెట్టకుండా చూసే పెళ్లిచూపులు లేటెస్టు ఫాషనండి!''

''ఇంతకన్నా వేరే మార్గం లేదంటావా?''

''ప్రస్తుతానికి లేదండి! సంక్రాంతి సీజను కాబట్టి హరిదాసు గెటప్పే సూటబులండి! పైగా హరిదాసుగారబ్బాయి మా క్లాసుమేటేనండి!''

''అయితే?''


''ఈ రాత్రి మీ బస వాళ్లింట్లోనే..ఇన్స్టెంటుగా మీకో పద్యమో-పాటో నేర్పించమనడమే కాకుండా, తంబూరా పట్టుకోవడం, చిడతలు వాయించడం కూడా నేర్పించమని చెప్తా! ఉదయమే మీరు ఆ ముగ్గురు ముద్దుగుమ్మల ఇళ్లకు మాత్రం హరిదాసులా వెళ్తేచాలండి! నేనూ బుల్లిహరిదాసులా మీకూడా వస్తానండి!'' అంటూ తీసుకుపోయాడు హరిదాసు గారింటికి.

★★★

కోనసీమ నావరించిన చలిపులిని భోగిమంటలతో తరిమేస్తున్న కుర్రకారు-హరిదాసు వేషంలో వస్తున్న రవితేజను విచిత్రంగా చూస్తుంటే, అతని చిడతల చప్పుళ్లకు కోనసీమ కన్నెపిల్లల గుండె చప్పుళ్ళు చిత్రంగా స్పందిస్తుంటే అసూయగా చూస్తున్నారు పండక్కి వచ్చిన కోనసీమ కొత్త అల్లుళ్లు.

ముగ్గులు చెరిగిపోతే ముప్పొస్తుందేమోనని, గొబ్బెమ్మలు తొక్కితే గొడవైపోతుందేమోనని పాదాలు వాటి మీద పడకుండా రవితేజ హరిదాసు వేషంలో నెత్తిమీద అక్షయపాత్ర పడకుండా జాగ్రత్తపడ్తూ గెంతుతూ గజ్జెల సవ్వడులతో వస్తుంటే అదేదో 'ఇంపోర్టెడ్' డాన్సనుకున్న అమ్మాయిలు తమ ఇళ్ళ కిటికీల్లోంచి క్రొత్త హరిదాసును క్రీగంట చూపులు చూస్తూ తమ కలల రారాజులతో ఊహల ఉయ్యాల్లో తేలిపోతున్నారు.

కేవలం ముగ్గురమ్మాయిల ఇళ్ళకెళ్లాలనుకున్న రవితేజ తన చిడతల చప్పుడికి బియ్యం పట్టుకుని వాకిట్లోకొచ్చేస్తున్న మరికొంత మంది ఇళ్లకు కూడా తమ మీద అనుమానం రాకుండా వెళ్లక తప్పలేదు. అప్పటికే శీను చేతిలోని సంచి బియ్యంతో నిండిపోయిందేమో డమరుగము వాయించేవాడు కన్పిస్తే బియ్యం ఇచ్చేశాడు.



బాగా లావుగా వున్న ఓ అందాల సుందరి ఏకంగా చేటనిండా బియ్యం తెచ్చేస్తుంటే కంగారుపడిన రవితేజ ఆ అమ్మాయిని చూస్తూ వెంటనే దీవించేసి బయటపడాలనే ఉద్దేశంతో ''శీఘ్రమేవ వెయిట్ డౌను ప్రాప్తిరస్తు!'' అనేశాడు. హరిదాసుగారు తనను సంస్కృతంలో దీవించారనుకున్న ఆ అమ్మాయి ముసిముసిగా నవ్వుకుంటూ లోనికెళ్లిపోయింది.

''మీకు ఇంజక్షనంటే భయం లేదు కదా గురూగారూ?'' ఉన్నట్టుండి అడిగాడు శ్రీను.

''ఎందుకనలా అడిగావు?'' కంగారుపడ్తూ అడిగాడు రవితేజ.

''మా ఊళ్లో కుక్కల బెడదెక్కువండి!'' వెనక్కి తిరిగి అన్నాడు దూరంగా తమను ఫాలో అవుతున్న ఓ నల్లకుక్కని చూస్తూ.

''కరుస్తాయా?...ఆ విషయం ముందే చెప్పొచ్చుగా!'' భయపడ్తూ అన్నాడు.

''కరిస్తే పర్లేదండి! బొడ్డు చుట్టూ ఇంజక్షన్లు చేయించుకోవచ్చు! మొరిగి జనాల్ని పోగేసి మన అంతు చూసిగాని వదలవండి!''

''ప్రక్కనే నువ్వున్నావుగా?''

''అఫ్‌కోర్సు! ఊళ్లోని వీధి కుక్కలకు నేను పరిచయమే అయినా మీలా నేనూ వేషంలో వుండడంతో నేనెందుకావేషం వెయ్యాల్సివచ్చిందో తెల్సుకోకుందామనే కుతూహలం వాటికీ వుండొచ్చుకదాండి! అందుకని కరవడానికొస్తే కంగారుపడకండి! నేను చూస్కుంటా!'' అర్జునుడికి గీతోపదేశం చేస్తున్న శ్రీకృష్ణుడిలా అన్నాడు.

ఓ ఇంటి గుమ్మంలో మెరుపుతీగలా ప్రత్యక్షమైన కవిత తన చేతుల్లోని కుక్కపిల్లను ముద్దాడుతూ వాళ్ల దగ్గరకొచ్చింది. ఆమె వెనుకే బియ్యం పట్టుకు వచ్చింది పనిమనిషి.

కవితను పరీక్షగా చూస్తున్న రవితేజను దొంగనుకుందో ఏమో కుక్కపిల్ల మొరగడం ప్రారంభించింది. కవిత కుక్కపిల్లను వారించక పోగా తన లిప్‌స్టిక్ పెదాలతో ముద్దాడటం చూసిన శీను తన కోపాన్ని ముగ్గుల మీద చూపించాడు. చెరిగిన ముగ్గుల్ని చూసి ఆమె కోపంతో శీను మీద మండిపడింది. తన యజమానురాలు కోపాన్ని చూసి కుక్కపిల్ల మరింత గట్టిగా మొరగడం ప్రారంభించింది. ''బుజ్జిముండ కోపంలో కూడా ముద్దొస్తోంది'' అని మెల్లగా అని తిన్నగా వుండక ''కూల్‌డౌన్ ప్రాప్తిరస్తు!'' అంటూ కుక్కపిల్ల నెత్తిమీదో మొట్టికాయ వేస్తూ కావాలనే గొబ్బెమ్మలు తొక్కేశాడు శీను.

ఆమె అపరకాళిలా వాళ్లను చూస్తూ ''రాజూ!'' అని గట్టిగా అర్చింది.

సంక్రాంతి సీజన్లో చాటుమాటుగా జరిగే కోడిపందాల్లో ఓడిపోయిన కోడిపుంజులా వెనక్కి తిరిగి దూరంగా ఆ వీధి చివరకు పరుగెత్తాడు రవితేజ. ''రాజంటే ఎవరు?'' అడిగాడు రవితేజ వగర్చుతూ వెనకాలే పరుగెట్టికొచ్చిన శీనును చూస్తూ.

''వాళ్లింట్లోని ఆల్సేషియన్ డాగ్! కవిత టెన్తు చదివిందండి! బోల్డు కట్నం ఇస్తారండి వాళ్లవాళ్లు! నచ్చిందాండి?'' అన్న శీనుతో రవితేజ ఏమీ మాట్లాడకుండా, కాలిగజ్జెల సవ్వడిని ఆపకుండానే తన దగ్గరున్న ఫోటోని తీసి 'కవిత' వున్నపార్టుని పరపరా చింపి శీను చేతిలో పెట్టాడు.

ప్రక్కవీధిలో అడుగుపెట్టిన రవితేజ శీను చూపించిన ఇంటి ముందాగాడు. బయటికెవరూ రాకపోవడంతో అక్కడే కాసేపు ప్రదక్షిణలు చేస్తున్నట్లు రౌండ్లు కొడ్తుండగా వచ్చింది పల్లవి! స్టన్నింగు బ్యూటీయేమో కళ్లార్ప

తమ్మిశెట్టి భుజంగరావు

కుండా, చిడతలు వాయించడం ఆపకుండానే పరీక్షగా చూశాడు. కాలికి స్లిప్పర్సు..నైటీలో వుంది..నోట్లో బ్రష్..అప్పుడే నిద్రలేచినట్లుంది. దగ్గరగా వచ్చిన ఆమె కొత్త కుర్ర హరిదాసును చూసి కంగారుపడి ఏదో అనాలనుకుని నోట్లో బ్రష్ వుండటంతో మానేసింది.

''పల్లవి డిగ్రీ చదివి ఉద్యోగం చేస్తోందండి!..మొన్నే ముగ్గుల పోటీలో ప్రైజు కొట్టేసిందండి!'' మెల్లగా అన్నాడు శ్రీను రవితేజ ముఖ కవళికల్ని గమనిస్తూ.

అంతకన్నా మెల్లగా ఫోటోలోని పల్లవి వున్న పార్టుని చింపి శీనుచేతిలో పెట్టాడు రవితేజ.

ఉన్నట్టుండి కుక్కల అరుపులు వినబడి అటు ఇటు చూశాడు రవితేజ. వీధిలో ఆ చివర నుండి ఇద్దరు గంగిరెద్దోళ్లని, వీధికి ఈ చివర నుండి ఓ బుడబుడక్కుల వాడ్ని కుక్కలు తరుముకొస్తున్నాయి.

''కొంపదీసి వాళ్లూ మనలాగే డూప్లికేట్లు కాదు కదా?'' అడిగాడు రవితేజ.

''గంగిరెద్దోళ్ల సంగతి ఏమోకానండి! బుడబుక్కుల వాడు మాత్రం డూప్లికేటేనండి!''

''ఆ విషయం నీకెలా తెల్సు?'' ఆశ్చర్యంగా అడిగాడు రవితేజ.

''అతనూ పాలకొల్లు నుండే వచ్చాడంటండి! మీలాగానే అతనూ నన్ను మీటయి ప్రొసీడయ్యాడు. మీకన్నా ముందే నన్ను కలిశాడు. పాపం మూడు రోజుల్నుండి తిప్పలుపడుతున్నా అతను కోరుకున్న అమ్మాయి ప్రత్యక్షం కావట్లేదండి! అందుకే మీకు హరిదాసు వేషం ప్రిఫర్ చేశానండి!''

''అంటే నాకు ద్రోహం చేస్తూ అతనికి కో-ఆపరేషన్ చేస్తున్నావన్నమాట!''

''అలాగైతే మీకూడా నేను రానుకదండి!..అయినా అతను మీకు పోటీ కాదులెండి! గజ్జెలగుర్రాన్ని ప్రేమించాడంట!''

''గజ్జెల గుర్రం ఎవరు?'' ఆశ్చర్యంగా అడిగాడు రవితేజ.

''మీకు చేటలో బియ్యం తెచ్చి పోసినమ్మాయండి!''

అంతకుముందు తమని దూరంగా ఫాలో అయిన నల్లకుక్క పెద్దపులిలా ఉన్నట్టుండి అక్కడ ప్రత్యక్షం కావడంతో తెల్లబోయిన రవితేజ కంగారుగా శీనును చూశాడు. అప్పటికే శీను వణికిపోతూ ''లాభం లేదండి గురూగారూ! ఆ కన్పిస్తున్న ఎదురింట్లోకి పరుగెట్టండి! అదే సృజన వాళ్లిల్లు!'' తొందర చేస్తూ అన్నాడు.

''మరి నువ్వు?''

''దూరంగా పారిపోతానండి!''

''ఎందుకని?''

''మా టెన్తు క్లాసుకు లెక్కల మాస్టారు సృజన వాళ్ల నాన్నగారేనండి మరి!'' అంటూ రవితేజ రెస్పాన్సు కోసం ఎదురుచూడకుండా పక్కసందులోకి దౌడు తీశాడు శీను.

ఏక్షణంలోనైనా మీదకురకడానికి సిద్ధంగా వున్న కుక్కను చూస్తూ భయంతో లోనికి పరుగెట్టుకొస్తున్న రవితేజ, హరిదాసు గార్కి బియ్యం వెయ్యడాన్కి బయటికొస్తున్న సృజన ఒకరినొకరు ఢీకొన్నారు. ఆమె దోసిళ్లలోని బియ్యం పైకెగిరి ఇద్దరిమీద పడ్డాయి అక్షతల్లా.

''కు..క్కండి!'' అంటూ ఏదో అనబోతూ వెనక్కి తిరిగి చూపించబోయిన రవితేజకు అక్కడ కుక్క కన్పించలేదు.

''కుక్క తరుముకొస్తుంటే భయంతో పరుగెట్టికొచ్చానండి!''

''పర్వాలేదండి!'' అంటూ క్రింద పడిన తంబురాను తీసి జాగ్రత్తగా అతని చేతికందించింది.

తలంటు పోసుకుని నీరెండలో కురులారబెట్టుకున్నట్లున్న ఆమె చీరలో అచ్చమైన తెలుగింటి ఆడపడుచులా, కోనసీమ దేవతలా, తన స్వప్న సుందరిగా కన్పడేసరికి అమితానందంతో ''యురేకా'' అనబోయి ''సృజన..'' అనేశాడు గట్టిగా.

''అరె! నా పేరు మీకెలా తెల్సండి?'' ఆశ్చర్యపడ్తూ అడిగిందామె.

''శీను చెప్పాడండి!''

''శీనంటే ఎవరండి?'' ఆమె మెల్లగానే అడిగినా రవితేజ కంగారుపడిపోతున్నాడు.

''మీ ఊరేనండి!..శీనని..''

''మా ఊళ్లో బోల్డుమంది శీనులున్నారండి!'' నీళ్లు నములుతున్న రవితేజను చూస్తూ ''అతని గురించి తెలియని మీరు నా గురించి ఎందుకు తెలుసుకున్నట్లు? పైగా మీరు హరిదాసులా లేరు! మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుగా కూడా వుంది. ఎవరు మీరు? ఎందుకొచ్చినట్లు?'' సౌమ్యంగానే అడిగినా నిలదీస్తున్నట్టుగా అన్పించాయి ఆమె మాటలు రవితేజకు.

''పెళ్లి చూపులండి!''

''ఎవరికండి?''

''మీకండి! కాదు నాకండి-కాదు కాదు-మనకండి!''

''ఆ?''

''హైటెక్ పద్ధతండి!.. శీను చెప్పాడు.''

''అదిగో మళ్లీ శీనంటున్నారు..అసలు మీ పేరు?'' అడిగింది రవితేజను ఆపాదమస్తకం పరీక్షగా చూస్తూ.

''రవిదాసు..కాదు..రవితేజ!''

ఒకదానికొకటి పొంతన లేకుండా మాట్లాడేస్తున్న రవితేజను చూస్తూ ఆమె ఏదో అనబోతుండగా జనం వచ్చేస్తారని కంగారుపడిపోయిన రవితేజ ఇక లాభం లేదనుకుని మూడేమూడు నిమిషాల్లో మొత్తం తన బయోడేటాను చెప్పి ఆమె మీద తనకున్న 'సదభిప్రాయాన్ని' కూడా చెప్పేశాడు.

''అంటే మీకు నేను నచ్చితే సరిపోతుందా? నాకు మీరు నచ్చక్కర్లేదా?'' రాబోతున్న నవ్వును మునిపంటి క్రింద అదిమిపెడ్తూ అందామె.

''మీకు నేను తప్పనిసరిగా నచ్చుతానని..''

''మీ శీను చెప్పాడా?'' మధ్యలో అడ్డుపడ్తూ అడిగింది చిరుదరహాసంతో.

''అవునండి!''

''నమస్కారం బావగారూ!'' అన్న మాటలు విన్పించి గుమ్మంకేసి చూశాడు రవితేజ.

గుమ్మానికానుకుని చిద్విలాసంగా నవ్వుతూ కన్పించాడు శీను.

''నువ్వు..ఇక్కడ?'' ఆశ్చర్యంతో నోరెళ్లబెట్టాడు రవితేజ.

''ఇది మా ఇల్లేనండి!''

''అంటే..సృజన?''

''మా అక్కేనండి!'' ముసిముసి నవ్వులు నవ్వుతూ అన్నాడు శ్రీను.

తనను బావగారిగా 'ఓకే' చేసి సహకరించినందుకు శీనును పొగడాలో లేక తనను తెలిగ్గా బుట్టలో పెట్టి కాబోయే బావగారితో ముందుగానే హరిదాసు వేషం కట్టించి ఓ ఆట ఆడించినందుకు తెగడాలో అర్థంగాక జుట్టు పీక్కుంటుంటే కుక్క అరుపులు విన్పించి అటుకేసి చూశాడు. ఆశ్చర్యం-

అంతకు ముందు తనను తరుముకొచ్చిన నల్లకుక్క!

ఏదో అనుమానం వచ్చి శీనును ప్రశ్నార్థకంగా చూస్తూ ''ఆ కుక్క?'' చెయ్యెత్తి చూపిస్తూ అడిగాడు.

''మాదే!'' శీను ముఖంలో చిలిపి కృష్ణుడి లీలలు.

ఎదురుగా వున్న ఆమెని తప్పించుకుంటూ, ఉక్రోషంతో శీనును తరమబోతూ కాలుకేదో అడ్డుపడి క్రిందపడబోతున్న రవితేజ చేతిని గట్టిగా పట్టుకుంది సృజన.

తనామె తమ్ముడి జోలికి పోకుండా, తను క్రింద పడిపోకుండా చూసిన ఆమె చాకచక్యానికి అబ్బురపడిన రవితేజకు తెలియదు-రెండు రోజుల క్రితమే ఎవరో చెప్పగా ముందుగా కోనసీమ వచ్చి సృజనను చూసి ముచ్చటపడ్డ తన తల్లిదండ్రులు ఆమెనే తమ కోడలిగా చేసుకోవాలనే కోరికతో అర్జంటుగా పెళ్లిచూపులకి రమ్మని తనకు పూర్తి వివరాలతో లెటరు వ్రాశారని!

ముద్దులొలికే ముద్దబంతి పువ్వులోని రేకల్లా తన చేతి వేళ్లతో పెనవేసుకున్న ఆమె వేళ్ల మృదు స్పర్శను ఆస్వాదిస్తున్న రవితేజకు అసలే తెలియదు-ఆపరేషన్ హెచ్.వి.పి. పథకానికి రూపకల్పన వెనుకున్నది 'సృజనే' నని.

★

